
## మీరూ ఆలోచించండి!

# వెలుగు వైపు పయనిద్దాం!

'హరిత'



"రత్తమ్మా! అన్నం పెట్టెయ్! నిరాహారదీక్ష చేయాలి!"

పదోక్లాను చదువుతున్న కిరణ్—ఉదయం ఏడు గంటలకే కిచెన్‌లో వంటమనిషి మీద అరుస్తున్నాడు. అప్పుడే భోజనం ఏమిట్రా అంటోంది వాళ్ళమ్మ. వాడి హడావుడి చూస్తోంటే నవ్వొస్తోంది.

రిజర్వేషన్ పెచ్చింపుకు నిరసనగా గాంధీ బొమ్మవద్ద రిలే నిరాహారదీక్షలు—రోజూ ఉదయం ఏడునుండి సాయంకాలం ఏడువరకూ—నలుగురు చొప్పున దండలు వేసుకొని అక్కడ కూర్చుంటున్నారు. ఈ రోజు ఫోటో తీసి పేపర్లకి పంపుతారట. ఆలస్యంగా వెళితే—కాలేజీ కుర్రాళ్ళు ముందు కూర్చుని హైస్కూలు కుర్రాళ్ళని వెనక నిలబెడతారని కిరణ్ భయం. అందుకూ ఆ హడావుడి!

"భోజనం చేశాక యింక నిరాహారదీక్ష ఏమిట్రా?" అన్నాను నవ్వుతూ.

"నిరాహారదీక్ష అంటే—అక్కడ కూర్చున్న తరువాత తినకూడదు అంతే!" అన్నాడు రోషంగా.

వాడి తండ్రికి తండ్రిని నేను! అందువల్ల గౌరవించి ఏడవాలన్న "తపన" కనిపిస్తోంది వాడి ముఖంలో!

ప్రభుత్వం హడావుడిగా రిజర్వేషన్‌లు పెచ్చించడంతో విద్యార్థులు రెండు వర్గాలుగా చీలిపోయారు.

"ప్రతిభ హత్య" అంటూ 'శవాల్ని' ఊరేగించే వర్గం ఒకటి!

"ప్రతిభ మీ గుత్త సొత్తుకాదు. మాలోనూ ఉన్నారు ప్రతిభావంతులు" అని సవాలు చేసే వర్గం మరొకటి!

మా ఊరి ప్రతిభావంతులు గోడల మీద రాస్తున్న తప్పులు, బస్సులు మీద రాస్తున్న బూతులూ చూపించి-ఇదేనా ప్రతిభ? ఇదేనా మీ సంస్కారం?—అని అడగడం నాకు సరదా! నా ప్రశ్నలు విని రోషంగా బుసలు కొట్టడం వాడికి ముచ్చట!

వాడి దృష్టిలో నేను ఎనిమీ నంబర్ వన్! వాళ్ళక్క ఎనిమీ నంబర్ టూ!

ఓరోజు—నిరాహార దీక్షా శిబిరంలో—నలుగురు దండలు వేసుకుకూర్చున్నారు—ఇద్దరు నవలలు చదువుకుంటూ, ఇద్దరు కబుర్లు చెప్పుకుంటూ వాళ్ళల్లో ఒకడు—రోడ్డున పోతున్న అమ్మాయిని చూసి ఏదో కుళ్ళు జోక్ వేసినట్లున్నాడు.... రెండోవాడు అటుచూసి నవ్వుతున్నాడు!

నాకు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది—జోక్ చేసినవాడు గత సంవత్సరం అమ్మాయిల్ని వేధించినందుకు సస్పెండ్ అయ్యాడు. ఆ ఉక్రోషంతో ప్రిన్సిపాల్ మీద తిరగబడి సమ్మె చేయించాడు.

అతడు-యిప్పుడు ప్రతిభావంతుల నాయకుడు!

నా హృదయం మూల్గింది... మా రోజుల్లో నేనూ సమ్మెలు చేసాను, చేయించాను—బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా.

అప్పుడు నిరాహారదీక్షలు యిలా ఉండేవా!

ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ కలవారినే నిరాహారదీక్షకు ఎంపిక చేసేవారు. వారి ముఖాలలో దీక్ష, వ్యగ్రత కనిపించేవి. ఆత్మ విశ్వాసం, స్థైర్యం కనిపించేవి. మౌన ప్రార్థనతో కాలం గడిపేవారు. లేదా రాట్నం వడికేవారు.

తండోపతండాలుగా శిబిరాలకు వచ్చే జనం ముఖాలలో ఆందోళన, వాతావరణంలో గంభీరత ఉండేవి. తను కృశించిపోతూ ఎదుటివారిలో సానుభూతి, దీక్ష రగిలించడమే నిరాహార దీక్ష లక్ష్యం.

ఈనాటి దీక్షల తీరే వేరు.

ఆఫీసు డ్యూటీలాగ ఎనిమిది గంటల నిరాహారదీక్ష, బూతులు రాసిన బదుపైనలు చలానులు, గాడిదల ఊరేగింపు, వేళాకోళాలాడుకుంటూ వీధులూడవడం—

వీధినాటకాల్లాగ వినోదం పంచుతున్నాయి గాని,

గంభీరత ఉండడంలేదు. నిరసన ఎప్పుడూ సీరియస్‌గా ప్రజలు తాదాత్మ్యం చెందేలాగా నిర్వహించాలి.

ఆ తరం మనిషిని. నా అభిప్రాయాలు ఈ తరానికి నచ్చవు. ఆ విషయం కిరణ్‌ని చూస్తేనే అర్థం అవుతోంది.

నానా హడావుడీ పడి, ఆదరాబాదరాగా భోజనం చేసి ఏడున్నరకి కంగారుగా నిరాహారదీక్షకి వెళ్ళబోతున్న కిరణ్‌ని ఆపి అడిగింది చైతన్య "ఫోటో తీయడానికి ఎవర్ని పిలిచారు?"

"ఏవన్ స్టూడియో" నగర్వంగా చెప్పాడు కిరణ్.

"అతడు ఎస్.సీ. కదా! ఎందుకు పిలిచారు?"

ఆ ప్రశ్నలోని వ్యంగ్యం అర్థం అయింది కాబోలు. కాళ్ళే సేటట్టు ఓ క్షణం అక్కవైపు చూసి, ఫోటో సంగతి జ్ఞాపకంరాగా, పరుగు తీశాడు కిరణ్.

ఉద్యోగాలకయితే ఎస్.సీ, బీసీ, ఓసీ అని చూస్తారు గాని ప్రతిభకు ఆ పక్షపాతం లేదు. మా ఊళ్ళో బెస్ట్ ఫోటోగ్రాఫర్—ఒక ఎస్.సీ.నంబర్ వన్ డాక్టరు ఒకప్పుడు మా అబ్బాయే. కాని యిప్పుడు—ఒక బీసీ!

ఆ రోజుల్లో మా అబ్బాయి మెడిసిన్ సీటు కోసం జరిగిన గలభా యింకా నా కళ్ళముందే కదలాడుతోంది.

అప్పుడు ఎంట్రన్స్ పరీక్షలంటూ లేవు. ఇంటర్‌లో వచ్చిన మార్కులే ప్రాతిపదిక. ఎస్సీలకు బీసీలకు .రిజర్వేషన్‌లేదు. రంగనాథ్‌కి, మా అబ్బాయి శ్రీధర్‌కి సమానంగా మార్కులొచ్చినా, సీటుమాత్రం రంగనాథ్‌కి దక్కింది. తనొక డాక్టర్ అవాలని ఎంతో దీక్షగా చదివాడేమో, సీటు దొరక్క పోయేసరికి భవిష్యత్తు నాశనం అయినట్టు బాధపడ్డాడు శ్రీధర్. రంగనాథ్ రంగంలో లేకపోతే తనకే సీటు దక్కేది!

ఆ కసితో—ఒంటరిగా కనిపించిన రంగనాథ్‌తో ఘర్షణ పెంచుకొని చిదగగొట్టేశాడు. దురదృష్టవశాత్తు అతని కంటికి బలమైన గాయం తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. కంటిలోనుంచి బొట బొటా రక్తం!

ఆ రక్తం చూడగానే మతిపోయి పారిపోయాడు శ్రీధర్. ఇంటికొచ్చి ఏడుస్తూ కూర్చున్నాడు. వాడు చేసింది చిన్న నేరం కాదు. రంగనాథ్ నోరువిప్పితే చాలు శ్రీధర్‌ని అరెస్ట్ చేస్తారు. ఒకసారి శిక్షపడితే చాలు ఆ తర్వాత ఏ కాలేజీలోనూ సీటు దొరకదు. ఉద్యోగమూ యివ్వరు. జీవితం సర్వనాశనం!

రంగనాథ్‌కి స్పృహ వచ్చాక ఎవరెన్ని విధాల అడిగినా ఈ అఘాయిత్యం ఎవరు చేసారో చెప్పనే లేదు.

అతడు హరిజన్ కాదు, సాక్షాత్తు ఆ హరియే! చేతులెత్తి నమస్కరించుకున్నాను.

ప్రక్క రాష్ట్రంలో ప్రయివేటు మెడికల్ కాలేజీలో మా అబ్బాయి శ్రీధర్‌కి సీటు వచ్చింది. దొరికినంతా అప్పు చేసి పంపాను.

రంగనాథ్ తనకు లభించిన మెడికల్ సీటు ఒదులుకున్నాడు.

ఓ రోజు అతడ్ని కలుసుకొని మా అబ్బాయి తరపున క్షమాపణ కోరుకున్నాను.

"ఆ నాడు కర్ణుడ్ని సూతపుత్రుడని అవమానించి అగ్రవర్ణాలతో పోటీపడే హక్కులేదు పొమ్మన్నారు. ఏకలవ్యుడికి విద్యార్హత లేదన్న పెద్దలే చివరకు బొటనవేలు కోసుకువెళ్ళారు! తరతరాల కథ ఈనాడు పునరావృతం అయింది! మీ అబ్బాయి తప్పేమీలేదులెండి! ఈ రోజు నాకన్ను పోయింది. రేపు కాలో, చెయ్యో పోతుంది! అడుగడుగునా తన్నులు తింటూ చదవడం ఎందుకని నేనే మానేసాను" అతని స్వరంలో బాధనుడులు.

ఏదో చెప్పబోయి—ఏమీ చెప్పలేక తలవంచుకున్నాను. తనుచేసిన పాపం వల్ల ఇంద్రుడి శరీరంనిండా కళ్లే! శ్రీధర్ చేసిన పాపం వల్ల నా శరీరం నిండా కళ్ళు. రక్తం కార్చే కళ్ళు!

రంగనాథ్ అద్భుత చిత్రకారుడు. ఇలా చూస్తూ అలా బొమ్మగీయ గల నైపుణ్యం అతనిది. ఆ కళ పుట్టుకతో వచ్చింది. ఏ రిజర్వేషన్ వల్లా వచ్చింది కాదు. ఆ కళనే జీవనోపాధి చేసుకున్నాడు అతడు.

పార్కులో ప్రేమ జంటలు, స్కూళ్ళలో పిల్లల బొమ్మలు గీసేవాడు. బొమ్మఖరీదు పావలా! కొత్త ఒక వింత! పావలా యిచ్చి తమ బొమ్మ గీయించుకోడాన్కి ఎగబడేవారు పిల్లలూ, జంటలూ.

అవికాక గ్రీటింగ్ కార్డులు తయారుచేసే వాడు. విలక్షణమైన అందంతో యిట్టే ఆకర్షించేవి అవి. వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా కోరినట్టు గీసేవాడు. కవితా రూపంలో ప్రత్యేకంగా అభినందనలు రాసేవాడు. వెల అర్ధరూపాయి! ఆ రోజుల్లో ఆ గ్రీటింగ్స్ పెద్ద క్రేజ్!

ఆ తర్వాత అతనిని అనుసరించి సొమ్ము చేసుకునే కాపీదారులు కొందరు బయలు దేరారు గాని అతని గిరాకీ తగ్గలేదు.

మా అబ్బాయి మెడిసిన్ పూర్తిచేసి వచ్చేసరికి రంగనాథ్ ఊరు విడిచి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత అతని సంగతి తెలియలేదు.

వెంటనే శ్రీధర్‌కి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం దొరికింది. మంచి డాక్టర్ అని పేరు తెచ్చుకున్నాడు. బీదా బిక్కి అందరు ఘనంగా పొగిడేవారు.

కన్నతండ్రిగా నాకు అంతకంటే ఏం కావాలి?

కానీ—రెండేళ్ళు తిరిగేలోగా డా॥శ్రీధర్ మారిపోయాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో యిచ్చే ట్రీట్‌మెంట్‌కి యింటివద్ద ఫీజు వసూలు చేయడం మొదలు పెట్టాడు. ఇప్పుడు అతడ్ని మంచి డాక్టర్ అనడంలేదు ఎవరూ. సమర్థుడైన డాక్టర్ అంటున్నారు ధనవంతులు మాత్రమే!

తండ్రి కొడుకులమైనా—మేము మాట్లాడుకునేది చాలా తక్కువ. సలహాలు, సంప్రదింపులు, హెచ్చరికలు-అన్నీ మూడో వ్యక్తి ద్వారానే. ఆ మూడో వ్యక్తి నా భార్య!

కట్నం ప్రసక్తి లేకుండా చదువు, సంస్కారంవున్న పేదపిల్లను కోడలుగా తెచ్చుకోవాలని నా కోరిక.

పేరు ప్రఖ్యాతులు లభించాయి కనుక ప్రయివేటు ప్రాక్టీసు పెట్టాలని మావాడి సంకల్పం. అందుకు అవసరం అయ్యే డబ్బు కట్నంగా యిచ్చే పిల్ల కావాలని వాడి అభిమతం. తల్లీకొడుకూ కలిసి నన్ను ఏకాకిని చేసారు.

ప్రయివేటు ప్రాక్టీసు పెట్టాక మావాడు బాగానే సంపాదించాడు. స్వంతయిల్లు కట్టించుకున్నాడు. ఊళ్ళో నంబర్‌వన్ డాక్టర్ అయ్యాడు. వాడి ప్రతిభ స్వంతానికి ఉపయోగపడిందిగాని అట్టడుగు ప్రజానీకానికి అందుబాటు కాలేదు. సమాజానికి ఉపయోగపడని ప్రతిభ వున్నా లేకపోయినా ఒక్కటే. గుడ్డికన్ను తెరిచినా మూసినా ఒక్కటే అయినట్టు!

ఈలోగా నా పదవీ విరమణ... భార్య మరణం... నా మకాం కొడుకు యింటిలోకి మారడం...

అంత యింటిలో నేను కేవలం ఒంటరిని. వాళ్ళకి నేనూ, నా సలహాలు అక్కర్లేదు. వేళకింత తిండి పెడతారు. నా పెద్దరికాన్ని గౌరవిస్తారు అంతే. ఆత్మీయత లేదు. ఆదరణ లేదు. మాటలుండవు.

ముసలి ఎద్దును కబేళాకు తోలివేయకుండా యింత గడ్డి పెట్టడం కరుణకాదూ?! కాపలా కాసే కుక్కకి ఒక ముద్ద పడవేయడం దాతృత్వంకాదూ?!

ఆ యింటిలో నాతో ఎక్కువగా మాట్లాడేది పిల్లలే. ఈ మధ్య కిరణ్‌కి నామీద కోపం. కానీ చైతన్యకు మాత్రం అభిమానమే.

ప్రభుత్వం వరసగా చేస్తున్న అపక తపకలు చూసి-అభిమానంతో పట్టం కట్టిన ప్రజల్లోనే అసంతృప్తి బయలుదేరింది. రిజర్వేషన్ హెచ్చింపుతో ఆ అసంతృప్తి రాజుకుంది. ప్రభంజనం బయలుదేరింది.

డాక్టర్లు, లాయర్లు, యింజనీర్లు—అందరూ చేతులు కలిపారు. కార్లు, డబ్బు, నిర్వహణ—అంతా ప్లాన్ ప్రకారం సాగిపోతోంది. అంతవరకూ బాగానే వుంది.

కోర్టు స్టే యిచ్చాక ఆందోళన విరమించి ఉండాల్సింది. కానీ కొనసాగించడం వల్ల—చివరకు అసెంబ్లీ వద్ద కనీవినీ ఎరుగని సంక్షోభం!

పోలీసులు రాక్షసంగా ప్రవర్తిస్తే ఉద్యోగులు పైశాచికంగా ప్రతిస్పందించారు—ఆ మర్నాడు!!

పోలీసు దౌర్జన్యాన్ని నిరసించే పెద్దలు, ప్రతిభావంతులు-ఉద్యోగుల దౌర్జన్యాన్ని నిరసించకపోగా, పైగా సమర్థించడం నన్ను దిగ్భ్రాంతిలో పడేసింది... ఇది ద్వంద్వ ప్రమాణాల దేశం!

సర్వమత సమానత్వం అని అరుస్తూనే మతం పేరు చెప్పి నరుక్కుంటాం! కులవర్గ రహిత సమాజం

అంటూనే కులాల కుళ్ళులోపడి కొట్టుకుంటాం.

నేను గాంధీయవాదిని. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవాడిని. అప్పటికీ యిప్పటికీ మనలో వచ్చిన నైతిక పతనం నన్ను అతలాకుతలం చేస్తోంది.

"విజయం! ఘనవిజయం!!" అని అరుస్తూ సుడిగాలిలాగ దూసుకు వచ్చి డాన్స్ మొదలుపెట్టాడు కిరణ్. ఇంట్లో అందరూ చుట్టూమూగి చోద్యం చూస్తున్నారు. అందరి ముఖాల్లోనూ ఆనందం! అందరూ రేడియో వార్తవిన్నారు...

హైకోర్టు రిజర్వేషన్ పెంపు కొట్టివేసింది. "మీ గొప్పదనం ఏముందోయ్, బోడి! మీరు ఆందోళన చేయక పోయినా కోర్టు తీర్పు అలాగే వచ్చేది" అంది చైతన్య.

తమ విజయాన్ని తక్కువగా అంచనా వెయ్యడమా! కిరణ్‌కి కోపం వచ్చేసింది. డాన్స్ ఆపి కొరకొరా చూసాడు. కిల కిలా నవ్వేసింది చైతన్య. ఒక్కసారిగా ఉద్రేకం పొడుచుకు రాగా—అక్కని కొట్టడానికి సిద్ధపడ్డాడు తమ్ముడు!

అది కిరణ్ తప్పుకాదు. విజయగర్వం అలాంటిది!

ఆ విజయగర్వంతో ఒక వర్గం సినిమావాళ్ళ బానర్లు, మంత్రుల యిళ్ళమీద దాడిచేస్తే—మరొక వర్గం జడ్జీల బొమ్మలు తగలబెట్టింది!

అలవాటుగానే—తమ దౌర్జన్యం సంగతి మరిచిపోయి, ఎదుటి వారి దౌర్జన్యాన్ని నిరసించాయి—రెండువర్గాలూ!

భగవాన్! ఈ దేశంగతి యింతేనా?

బాపూజీ! ఇందుకేనా మాకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టావ్?

ముసలి ఎద్దులాగ, కాపలా కుక్కలాగ పడి ఉండడం తప్ప నేనేమీ చేయలేనా? చీకటిని తిడుతూ కూర్చోవడం తప్ప, చిరుదివ్వెను వెలిగించలేనా?

ఆ రాత్రంతా యివే ఆలోచనలు... నిద్రపట్టనేలేదు.

స్వగ్రామంలో నాకొక చిన్నయిల్లు రెండకరాల మెట్ట వుంది. అక్కడికి పోయి ఒంటరిగా ఉండాలనిపిస్తోంది. చిన్న స్కూలు తెరిచి గాంధీతత్వం బోధించాలనిపిస్తోంది.

తెల్లవారేక బద్ధకంగా లేచాను. స్నానం చేసినా బద్ధకం వదలలేదు. వీధి గదిలో కూర్చున్నా—దినపత్రిక కోసం ఎదురుచూస్తూ

చటుక్కున చైతన్య లోనికివచ్చింది. నా చేతిలో ఒక కవరు పెట్టి పాదాభివందనం చేసింది. 'ఏమిటిది' అని కంగారుపడ్డాను.

"నీ పుట్టినరోజు తాతయ్యా!" అంది కిలకిలా నవ్వుతూ.

నా పుట్టిన రోజు అందరూ మరిచిపోయినా చైతన్య జ్ఞాపకం పెట్టుకుంది!

కవరులో గ్రీటింగ్ కార్డు—మడతవిప్పితే—ఒకప్రక్క నా బొమ్మ. రెండోప్రక్క శుభాకాంక్ష కవిత! కింద చైతన్య ముఖం.

మరీ మరీ చూసుకున్నాను—నా బొమ్మ అచ్చు నా ముఖంలాగే వుంది ఎవరు గీసారో గాని.

చైతన్య—ఆర్టిస్ట్ మోహన్‌ని పొగడ్డం ప్రారంభించింది. ఏ-వన్ ఫోటో స్టూడియో అతనిదే. ఫోటోల తోబాటు చిత్రాలూ గీస్తాడు. తెలుగు పత్రికల నిండా అతడు గీసిన చిత్రాలే. అవంటే స్టూడెంట్స్‌కి భలే క్రేజ్.

ప్రవాహంలాగ పొగిడేస్తోంది.

వయసొచ్చిన పిల్ల అంత ఉత్సాహంగా పొగడుతోందంటే—

అనుమానంగా చైతన్య ముఖంలోకి చూసాను. ఆ ముఖంలో మందారాలు! ఆ మందారాల్ని దాచుకుందుకు చటుక్కున లోనికి పారిపోయింది.

మధ్యాహ్నం ఏ-వన్ స్టూడియోకి వెళ్ళాను. పెద్ద మేడ. అందంగా ఉంది. మోహన్‌లేడు కానీ అతని తండ్రి ఉన్నాడు. అయనది పరిచయమైన ముఖంలాగే కనిపించింది.

నవ్వుతూ నల్ల కళ్ళద్దాలు తీసేశాడు... రంగనాధ్!

చూడగానే తెలుస్తోంది. అతని జీవితం పూలపాన్పు అని!

పత్రికల్లో ఇలస్ట్రేటర్, కార్టూనిస్టుగా మంచిపేరు, డబ్బు సంపాదించాడట. ప్రయివేటుగా ఎమ్.ఏ. అయ్యాడు. కాలేజీలో చేరితే—తమ భవిష్యత్తు నాశనం అయినట్టు ఏడిచే ప్రతిభావంతులుంటారు. ఎందుకు లెమ్మని మోహన్‌ని కూడా ప్రయివేటుగానే చదివించాడట రంగనాధ్. ఉద్యోగం అనే బానిసత్వం కోసం ప్రతిభవంతులు కొట్టుకుచావనీ మనకెందుకు ఉద్యోగం? అని మోహన్ చేత ఫోటోస్టూడియో ప్రారంభించాడు.

పేరులోనే కాదు అది నిజంగా ఏ-వన్ స్టూడియోగా రూపుదిద్దుకుంది. పదిమందికి ఉపాధి కల్పించింది. కొద్ది కాలం క్రితమే వాళ్ళు ఈ ఊరువచ్చి స్థిరపడ్డారు.

"మీ అబ్బాయి డాక్టరుగార్ని చూశాను. కానీ మీరు కూడా ఈ ఊళ్ళోనే వున్నారని నాకు తెలియదు. మొన్న చైతన్య మీ ఫోటో తెచ్చింది బొమ్మగీయమని. మీరు మా యింటికి వస్తారని ఎదురుచూస్తూనే వున్నా" అన్నాడు.

లోనికి తీసుకువెళ్ళి భార్యని పరిచయం చేశాడు. మా యిద్దరికీ టీ తెచ్చి సరదాగా కబుర్లు చెబుతూ మాతోనే కూర్చుంది. ఎంతో హాయిగా అనిపించింది.

వాళ్ళది కులాంతరవివాహం.

సరదాగా మాట్లాడుతూనే హఠాత్తుగా మారిపోయాడు రంగనాధ్. "అడ్డదారిలో ముందు దూరగలవాడికే సినిమా టికెట్ లభిస్తుంది. అలాగే రిజర్వేషన్లూ! కొద్ది మందే ప్రయోజనం పొందుతున్నారు గాని అట్టడుగు ప్రజలు అలాగే వుండిపోయారు. పైగా రిజర్వేషన్ల వల్ల కులవైషమ్యాలు పెరిగిపోతున్నాయి... సామరస్యం సాధించడానికి ఏంచేయాలి?"

నా అభిప్రాయం కోసం కాబోలు ఓ క్షణం నావైపు చూశాడు.

మౌనమే నా భాష!

నామౌనం చూసి అతడే చెప్పాడు. "చదువుకున్న ప్రతివాడూ ఉద్యోగం కోసం ఎగబడడం; ఉన్న కొద్ది అవకాశాలూ రిజర్వేషన్ల వల్ల తమకు అందకుండా పోతున్నాయని ఉద్రేకం—యివే కులవైషమ్యాలకు కారణం. ఇందుకు—వృత్తివిద్యలు, కులాంతర వివాహాలే పరిష్కారం అని నానమ్మకం. ఆ దిశలో నావంతు కృషి నేను చేస్తున్నా. కులప్రసక్తి లేకుండా ఆసక్తి వున్న పదిమందిబీదలకు చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ నేర్పుతున్నా. నేను కులాంతర వివాహం చేసుకున్నాను. మోహన్‌కి కూడా అలాగే చేద్దామనుకుంటున్నాను. అమ్మాయి సిద్ధంగానే వుంది. ఇంక ఆశీర్వాదమే బకాయి!"

అర్థవంతంగా నవ్వి నావైపు చూశాడు. అతని భార్య కూడా ఏదో రహస్యం చెబుతున్నట్లు—దరహాసం చిందించింది.

నా అనుమానం నిజమే.

### కథాచర్చ

రచయిత్రి పూర్తిగా రాసిన ఈ కథను ఈ ఘట్టంలో నిలిపివేశాము. ఆ తర్వాత ఏం జరిగిందనీ పాఠకులు వూహించి, ఆ కథను కొనసాగించినట్లుగానే రాస్తూ, పూర్తిచేయాలి. రచన అరఠావు సైజులో ఒక పేజీకి (ఒకవైపునే) మించకూడదు. విభిన్నమైన ధోరణిలో కథను ముగించిన వారు, లేదా రచయిత్రి ముగింపుకు దగ్గరగా రాసిన వారిలో, అందరికంటే బాగారాసిన పాఠకురాలికి పారితోషికం వుంటుంది. అటువంటి ముగింపు రాసిన తక్కిన వారి పేర్లనూ ప్రకటిస్తాము.

ఈ కథాచర్చలో పాల్గొనడానికి ఆఖరుతేదీ ఆగస్టు 7. రచనా వ్యాసంగం పట్ల ఉత్సాహం గలవారికి ఇదో చక్కని అవకాశం. త్వరపడండి.